

డబ్బులివ్వక పోతే ఖబడ్దార్..!
ఓ ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ యువకుడు బాలికను ట్రాప్ చేశాడు. అసభ్యకర పోస్టులు పంపించి డబ్బులు డిమాండ్ చేశాడు. చివరకు పోలీసులకు చిక్కాడు.
- 8లో



దక్కని ఆశించిన 'మద్దతు'
విత్తనాలు, ఎరువులు సాగు వ్యయం రోజురోజుకూ తడిసి మోపెడవుతోంది. ఎరువులు, పురుగు మందుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.
- 8లో

18న రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గం ఎన్నిక
పార్వతీపురం టౌన్: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందని కలెక్టర్, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు ఎ.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందన్నారు.

న్యూస్‌రీల్

అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోనూ.. నేడు 'వెన్నుపోటు దినం'



- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ఎన్నికలకు ముందు ప్రకటించిన హామీలు నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న దగాపై ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 11 నియోజకవర్గ కేంద్రాల్లో బుధవారం తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మంగళవారం పిలుపునిచ్చారు. నిరసన ర్యాలీలు చేపట్టి తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్లకు కూటమి ప్రభుత్వం చేస్తున్న దగా పాలనపై వినతిపత్రాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి అదనపు బాధ్యతలు

విజయనగరం టౌన్: ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.వెంకటేశ్వరరావుకు సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పనిచేసిన జిల్లా సాంఘిక సంక్షేమాధికారి బి.రామానందం పదోన్నతిపై అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఈడీ వెంకటేశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

5న రాష్ట్ర మాలల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ రాక

రాష్ట్ర మాలల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్ ఈ నెల 5న గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఈడీ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో సమావేశమై పథకాల అమలుపై చర్చిస్తారని పేర్కొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో ఆన్‌లైన్ శిక్షణ

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ), ఢిల్లీ యూనివర్సిటీ యూజీసీ, మాలవియామిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్, ఎస్‌జీటీబీ ఖల్సా కాలేజీ సంయుక్త నిర్వహణలో బోధన సిబ్బందికి ఈ నెల 13 తేదీ వరకు నిర్వహించే ఆన్‌లైన్ శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. జాతీయ విద్యావిధానం-2020పై బోధనా సిబ్బందికి అవగాహన కల్పించడం, సున్నితత్వాన్ని పెంపొందించే అంశాల్లో ఇచ్చే శిక్షణకు జేఎన్‌టీయూ జీవీ అనుబంధ కాలేజీల నుంచి సుమారు 200 మంది హాజరయ్యారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్, కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ జి.జయసుమ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ సాంకేతిక విద్యా విధానంపై అవగాహన పెంచుకోవడానికి ఇలాంటి శిక్షణలు దోహదపడతాయన్నారు.

సినిమా థియేటర్లలో ఆకస్మిక తనిఖీలు



రాధామాధవ సినీ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ

చీపురుపల్లి: పట్టణంలోని రాధామాధవ సినీ కాంప్లెక్సు ఆవరణలోని వంశీ, విష్ణు, వైభవ్ సినిమా థియేటర్లను ఆర్డీఓ ఆశియ్య, డీఎస్పీ రాఘవులు, సీఐ శంకరరావు, తహసీల్దార్ రాజారావు తదితరులు మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో తినుబండారాలు, వాటర్ బాటిళ్లు, డ్రింకుల అమ్మకాలు, ధరల పట్టికలను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సినీ కాంప్లెక్సును తనిఖీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామ్‌కుమార్, వీఆర్వో గోవిందరావు, వీఆర్‌ఏ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటివద్దనే రేషన్

విజయనగరం ఫోర్ట్: వృద్ధులు, దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలతో మంచం పట్టినవారికి ఇంటివద్దకే రేషన్ సరుకులు సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి కె.మధుసూదన్‌రావు తెలిపారు. అటువంటి వారికి ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు డీలర్ స్వయంగా ఇంటికి సరుకులు అందజేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు ఆదేశాలిచ్చామన్నారు.

ఓటేసిన పాపానికి.. వెన్నుపోటు!



విజయనగరం/విజయనగరం ఫోర్ట్/విజయనగరం అర్బన్/రాజాం:

ఏడాదైంది.. కూటమి నేతల రాక్షస పాలనకు!
ఏడాదైంది.. రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం స్థానంలో రెడ్‌బుక్ అమల్లోకి వచ్చి!
ఏడాదైంది.. ఓటేసిన పాపానికి వెన్నుపోటు దెబ్బ ఎలా ఉంటుందో రుచి చూసిన ప్రజలకు!

- ఏడాది కూటమి పాలన అట్టర్‌ఫ్లాప్
- అందని అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఆడబిడ్డల నిధి
- నిరుద్యోగభృతి ఊసేలేదు.. చిరుద్యోగుల తొలగింపు
- అక్కరకురాని బడుగు, బలహీన వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ హామీ
- సూపర్ సిక్స్ అంటూ మోసం ఫిక్స్‌చేసిన కూటమి నేతలు
- వలంటీర్, ఎండీయూ వ్యవస్థల రద్దుతో ప్రజలకు కష్టాలు
- వేలాదిమంది నిరుద్యోగుల ఉపాధికి గండి
- ప్రశ్నించేవారిపై రెడ్‌బుక్ రాజ్యాంగంతో దండన
- దీనికి నిరసనగా నేడు ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో 'వెన్నుపోటు దినం' నిర్వహణ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలోనే అన్ని వర్గాల ప్రజలూ బాధితులుగా మారారు. గత ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలంటూ ఊదరగొట్టిన చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లు.. అరచేతిలో వైకుంఠం చూపారు. ఏరు దాటాక హామీలనే తెప్పను తగలబెట్టేశారు. ఎన్నికలకు ముందు జిల్లాకు వచ్చి.. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, సాగునీటి జలాలను అందిస్తామని, పరిశ్రమలు తెరిపిస్తామని, రహదారులు నిర్మిస్తామని.. ఇలా ఎన్నో హామీలిచ్చారు. ఇందులో ఒక్కటి కూడా పూర్తి చేయలేదు.

పేదల ఆశలు సమాధి

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛన్ అందజేస్తామని నాడు హామీ ఇచ్చారు. ఏడాది కాలంలో కొత్త పింఛన్ ఏ ఒక్కరికీ ఇవ్వకపోగా.. ఉన్నవి తీసేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో 2,82,897 మంది పింఛన్‌దారులు ఉండేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే ఆ సంఖ్య 2,71,532 లక్షలకు చేరింది. రూ.4 వేలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకొంటూనే, అనర్హుల పేరిట లబ్ధిదారుల ఏరివేత సాగుతోంది. 50 ఏళ్లకే పింఛన్ అన్న హామీ కూడా నెరవేర్చలేకపోయారు. గతంలో వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్ అందిస్తే.. ఇప్పుడు వీధి చివరన రచ్చబండకో, ఏ గుడి వద్దకో పిలిపించుకుని అందజేస్తున్నారు. రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులను ఆస్పత్రుల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు.
- రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఇచ్చిన రూ.13,500 కంటే అధికమన్నారు. ఏడాది కాలంలో పెట్టుబడి సాయం కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద ఇప్పటికే రెండు దఫాలు సాయం విడుదల చేసింది. చంద్రబాబు మాటలు నమ్మి ఓటేసిన సుమారు 3 లక్షల మంది రైతులు దగా పడ్డారు.



- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిశ్చింతగా అమ్మఒడి పథకాన్ని ఏటా రూ.15 వేల చొప్పున పిల్లలను బడికి పంపే తల్లులు పొందేవారు. నాలుగేళ్లలో రూ.1,014.33 కోట్ల నిధులను సమకూర్చింది. తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు.. ఏడాది కాలంలో ఒక్క రూపాయి ఇవ్వకుండా మోసం చేశారు. గత ప్రభుత్వం గడిచిన నాలుగేళ్ల కాలంలో విద్యాదీవెన, వసతి దీవెన కింద 1.65 లక్షల మంది విద్యార్థులకు రూ.180.69 కోట్ల నిధులు వెచ్చించగా, కూటమి ప్రభుత్వం 2024-25 ఏడాదిలో సుమారు రూ.35 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టింది.



- ఆడబిడ్డ నిధి కింద మహిళలకు నెలకు రూ.1500లు ఇస్తామని చెప్పి దగా చేశారు. తాము ఎక్కాల్సిన ఉచిత బస్సు ఎప్పుడొస్తుందా? అని జిల్లాలోని లక్షలాది మంది మహిళలు సంవత్సర కాలంగా ఎదురుచూస్తున్నారు.



- ఇంటికో ఉద్యోగమన్నారు. లేదంటే చదువుకున్న వారందరికీ నిరుద్యోగ భృతి కింద ఇస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగాలు ఎలానూ ఇవ్వలేకపోయారు.. పోనీ భృతి అయినా అందుతుందని జిల్లాలో సుమారు 5 లక్షల మంది ఎదురుచూస్తున్నారు. ఏడాదిగా ఒక్కొక్కరికీ రూ.36 వేలు చొప్పున కూటమి ప్రభుత్వం బాకీ పడింది.



- విద్యుత్ బిల్లులు తగ్గిస్తామన్నారు. సర్‌చార్జీల పేరుతో భారం మోపుతున్నారు.
- నూతన దంపతులకు రేషన్‌కార్డుల కోసం ఏడాదిగా ఎదురుచూపులే మిగులుతున్నాయి. సచివాలయ సేవలు ఒక్కొక్కటిగా దూరమవుతున్నాయి.

అరాచక పాలనకు వీరే సాక్ష్యం..

కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే వందలాది మంది ఉపాధిని తీసేసింది. కక్షసాధింపుతో ఫీల్డ్ అసిస్టెంట్లను, వలంటీర్లను, ఎండీయూ ఆపరేటర్లను, వెలుగు సిబ్బందిని, కేజీబీవీల్లోనూ, ఇతర శాఖల్లోనూ తాత్కాలిక ప్రాతిపదికన పని చేస్తున్న చిరుద్యోగులను, వంట కార్మికులను నిర్దాక్షిణ్యంగా తొలగించారు.

- తాము అధికారంలోకి వస్తే రూ.10 వేల చొప్పున గౌరవ వేతనమిస్తామని ఎన్నికలకు ముందు కూటమి నాయకులు వలంటీర్లకు హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే మూడు నెలలు గాలిలో ఉంచి, తర్వాత ఆ వ్యవస్థే లేదంటూ జిల్లాలోని 6,042 మంది వలంటీర్ల బతుకు తీశారు.
- పేదలకు ఇంటింటికీ రేషన్ అందించాలన్న సదుద్దేశం.. కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న ఆశయంతో గత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఈ వ్యవస్థను నమ్ముకుని జిల్లాలో 450 మంది ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు బతుకు వెళ్లదీసేవారు. కక్షపూరితంగా ఆ వ్యవస్థను కూడా రద్దు చేసి.. వందలాది కుటుంబాలను ఈ ప్రభుత్వం వీధిన పడేసింది.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి ఒక్కో షాపునకు సూపర్‌వైజర్, సేల్స్‌మెన్లు, రాత్రి కాపలాదారులను నియమించింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎత్తివేసి, ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టింది. దీంతో గత ఐదేళ్లు ఉపాధి పొందిన జిల్లాలోని 162 దుకాణాల సిబ్బంది రోడ్డున పడ్డారు. ఇప్పుడు వీధికో బెల్టుషాపును ప్రోత్సహిస్తూ మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారన్నది జనం మాట.
- ఎన్నో ఏళ్లుగా ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న పదుల సంఖ్యలో క్షేత్ర సహాయకులు, మేట్లను రాజకీయ కక్షతో తొలగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 10 మంది వరకు ఫీల్డ్ అసిస్టెంట్స్‌ను తొలిగించారు. జిల్లాలో 8 వేల మంది మేట్‌లో అధికమందిని తొలగించి వారి స్థానంలో కూటమి కార్యకర్తలను నియమించారు. వెలుగులో పని చేస్తున్న వీవోఏలు, కేజీబీవీల్లోని బోధనేతర సిబ్బంది, పలు శాఖల్లోని కంప్యూటర్ ఆపరేటర్లపైనా వేధింపులు కొనసాగుతున్నాయి.

వినడం, హామీ ఇవ్వడం కాదు.. పని పూర్తిచేయాలి ...



ఇటు టీడీపీ, అటు వైఎస్సార్‌సీపీతో పనిలేకుండా మాకు ఏ మాత్రం అధికారం వచ్చినా ఇక్కడ వంతెన నిర్మిస్తాం. ఇక్కడి 50 గ్రామాల ప్రజల కలను నెరవేరుస్తాం. 2018లో రాజాం నియోజకవర్గం సంతకవిటి మండలంలో వాల్తేరు గ్రామంలో బలసల రేవు వద్ద నాగావళి నదిపై వంతెన నిర్మాణం నిమిత్తం ప్రజలుచేస్తున్న పోరాటానికి మద్దతు ఇచ్చి పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడాదైనా గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ. 87 కోట్ల ఖర్చుతో తలపెట్టిన వంతెన నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు చొరవ తీసుకోకపోవడంపై జనం మండిపడుతున్నారు.

ఇదేనా మార్పు..



నేను మారిన మనిషిని.. నేనేంటో చూపిస్తా.. సంక్షేమమే నా ధ్యేయం.. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తా అంటూ హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ అంటూ మోసం ఫిక్స్ చేశారని జనం మండిపడుతున్నారు. ఏడాది పాలనలోనే ఆరేళ్ల పిల్లల నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు అందరినీ వెన్నుపోటు పొడిచారని విమర్శిస్తున్నారు. ఏడాది పాలన మోసం, దగా, అవినీతి, అరాచకం, అప్పుల మయంగానే ఉంది. చంద్రబాబు ఏడాది పాలన ప్రజలకు వాతలు.. ఉద్యోగులకు కోతలు.. వలంటీర్లకు వెతలు.. వారి చెప్పే అబద్ధాల కథలు.. ఇంతే.. ఇంతకంటే ఇంకేమీ లేదు. జగనన్న స్కీమ్ ఆంధ్రాగా మారిస్తే.. చంద్రబాబు స్కామ్ ఆంధ్రాగా మార్చేశారు. జగనన్న విద్యాంధ్రప్రదేశ్ కోసం పనిచేస్తే.. చంద్రబాబు మద్యాంధ్రప్రదేశ్ గా మార్చేశారు. ఎన్నిక ల్లో సంపద సృష్టిస్తామని చెప్పి సమస్యలు, అప్పులు సృష్టిస్తున్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటన రాజాం ప్రధాన రోడ్డును విస్తరిస్తాం. మూడు నెలల్లో పూర్తిచేస్తాం. రింగు రోడ్డు నిర్మిస్తాం. అంతర్గత రహదారులన్నీ అభివృద్ధిచేస్తాం. మూతపడిన పరిశ్రమలు తెరిపిస్తాం. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తాం. పేదలందరికీ రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్లు కట్టిస్తాం. వాల్తేరు వంతెన నిర్మాణాన్ని పూర్తిచేస్తాం. సూపర్ సిక్స్ పథకాలతో పేదల్లో కొత్త వెలుగులు నింపుతాం.
\- 2024 ఏప్రిల్ 15న రాజాంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు, కోండ్రుమురళీమోహన్ ఇచ్చిన హామీలు ఇవి. ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా నెరవేరలేదు.



అసంపూర్తిగా ఉన్న రాజాం ప్రధాన రోడ్డు నిర్మాణం

హామీల అమలు శూన్యం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోవడంలేదు. 42 రోజులు సమ్మె చేసిన అంగన్‌వాడీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రాతినిథ్యం వహించిన గజపతినగరం నియోజకవర్గంలో అంగన్‌వాడీ ఆయాను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వెలుగు వీవోఏలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించడం దారుణం. వలంటీర్లకు నెలకు రూ.10,000 ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వెన్నుపోటు పొడిచారు.
\- ఎ.జగన్‌మోహన్‌రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, విజయనగరం

దగాకోరు పాలన...



స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టండి.. విశాఖ ఉక్కు..ఆంధ్రుల హక్కు.. అని చెప్పిన నారా లోకేశ్.. అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్ల బిగించు తున్నారు. విశాఖఉక్కు కర్మాగారం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు చొరవచూపుతున్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. ఫుడ్ కోర్టు, సాగునీటి ప్రాజెక్టుల పనులను విస్మరించారు. నిరుద్యోగ భృతి, విద్యార్థులకు విద్యా దీవెన, తల్లికి వందనం ఇవ్వలేదు. విద్యుత్ చార్జీలు పెంచారు. కుళాయి చార్జీలు రెట్టింపు చేశారు. కూటమిది దగాకోరు పాలన.
\- రెడ్డి శంకరరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు, విజయనగరం

సాగుకు భరోసా లేదు..



గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లు క్రమంతప్పకుండా వైఎస్సార్ రైతుభరోసా-పీఎం కిసాన్ కింద రూ.13,500 చొప్పున అందించింది. వాటితో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకుని వ్యవసాయం చేసుకునేవాళ్లం. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అయినా ఇంతవరకు ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదు.
\- పొటుపురెడ్డి అప్పలనాయుడు, రైతు, పెదవేమలి గ్రామం

వైద్య కష్టాలు ఆరంభం



కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడంలేదు. ఫ్యామిలీ డాక్టర్ సేవలు పారదర్శకంగా అందడం లేదు. గత ప్రభుత్వం జిల్లాకు వైద్యకళాశాల మంజూరు చేసి ప్రజలకు భరోసా కల్పించింది.
\- ఎస్. సన్యాసిరావు, సామాజిక కార్యకర్త, నరవ గ్రామం

అభివృద్ధి శూన్యం



రాజాం-పాలకొండ రోడ్డు ప్రమాదకరంగా మారింది. గతంలో అధికారులు గోతులైనా పూడ్చేవారు. ఇప్పుడు అదికూడా లేదు. అధికారంలోకి వచ్చినవెంటనే రోడ్డును నిర్మించేస్తామని హామీలు ఇచ్చిన చంద్రబాబునాయుడు ఇంతవరకూ ఈ రోడ్డు పనులు పూర్తిచేయలేదు. రాజాం మండలంతో పాటు పట్టణంలో ఎటువంటి అభివృద్ధిలేదు.
\- లావేటి రాజగోపాలనాయుడు, వైఎస్సార్ సీపీ రాజాం మండలాధ్యక్షుడు, రాజాం

నాడు చదువుల విప్లవం.. నేడు సమస్యల రాజ్యం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో విద్యార్థులకు చేసిందేమీ లేదు. వసతిదీవెన నిలుపుదల చేసింది. విద్యాదీవెన బకాయిలు విడుదలచేయలేదు. గత ప్రభుత్వం మెడికల్ కాలేజీలను తీసుకొస్తే.. ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తూ విద్యార్థులకు చదువును భారంగా మార్చే ప్రయత్నం చేస్తోంది. వైద్యవిద్యను వ్యాపారంగా మార్చేసింది. గత ప్రభుత్వం చదువుల విప్లవం సృష్టిస్తే.. కూటమి ప్రభుత్వం సమస్యల విప్లవం తెచ్చిపెట్టింది.
\- డి.రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, విజయనగరం

తగ్గిన పనిదినాలు

- లక్ష్యం 1.10 కోట్ల పని దినాలు
- కల్పించిన పని 77.41 లక్షల పని దినాలు
- తగ్గిన 32.58 లక్షల పనిదినాలు



విజయనగరం మండలంలో పనులు చేస్తున్న వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: గ్రామీణ ప్రజల వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోంది. వేతనదారులకు పని కల్పనలో వెనుకబడుతోంది. దీనికి విజయనగరం జిల్లాలో తగ్గిన పనిదినాలే నిలువెత్తు నిదర్శనం. జిల్లాలో 3.84 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిలో 3.53 లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. జిల్లాలో 6.08 లక్షల మంది వేతనదారుల్లో 5.95 లక్షల మంది పనుల్లో పాల్గొంటున్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్, మే నెలల్లో 1.10 కోట్లు పని దినాలు కల్పించాలన్నది లక్ష్యం కాగా, 77.41 లక్షల పని దినాలే కల్పించారు. 32.58 లక్షల పనిదినాలు కల్పించలేక పోయారు. గతేడాది ఏప్రిల్, మే నెలల్లో 1.10 కోట్ల పనిదినాలు వేతనదారులకు కల్పించారు. ఈ ఏడాది మాత్రం చాలా వెనుకబడ్డారు. మరోవైపు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో వేతనదారులు ఆందోళన చెందుతున్నారు.

5 నుంచి ఐటీఐలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్



జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీగిరి

విజయనగరం అర్బన్: జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు ఈ నెల 5 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీగిరి తెలిపారు. కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఆయన మంగళవారం విడుదల చేశారు. విద్యార్థులు పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా కేటాయించిన ర్యాంకుల బట్టి వారికి కేటాయించిన తేదీల్లో ఒరిజినల్ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. మొదటి విడతగా ఈ నెల 5, 6, 10వ తేదీల్లో నిర్వహిస్తున్న షెడ్యూల్‌లో ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 2 గంటల ప్రారంభిస్తామని తెలిపారు. కౌన్సెలింగ్ తేదీలను మెసేజ్ రూపంలో సెల్‌కు పంపిస్తామన్నారు.

సీజ్‌చేసిన జేసీబీ అప్పగింత

- 'సాక్షి' కథనానికి స్పందించిన పోలీస్ యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్...

చీపురుపల్లి: దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఓ ఇంటిని కూల్చేందుకు తీసుకెళ్లిన ఓ ప్రైవేటు జేసీబీను రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు చీపురుపల్లి పోలీసులు సీజ్‌చేసిన సంగతి తెలిసిందే. దీనిని దేవదాయశాఖ అధికారులు కూడా ఖండించారు. తాము జేసీబీని అద్దెకు తీసుకెళ్లినట్టు వివరణ ఇచ్చినా పోలీసులు వినకపోవడంతో 'ఇదెక్కడి రాజ్యాంగం' అనే శీర్షికన మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. తక్షణమే జేసీబీని యజమానికి అప్పగించాలని చీపురుపల్లి పోలీసులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జేసీబీను రిలీజ్ చేశారు. పోలీసుల సూచన మేరకు యజమాని దుర్గారావు తన డ్రైవర్‌ను తీసుకెళ్లి జేసీబీని ఇంటికి తీసుకెళ్లిపోయారు.



ఇదెక్కడి రాజ్యాంగం..!

సాక్షి పత్రికలో వెలువడిన 'ఇదెక్కడి రాజ్యాంగం' కథనం

అన్యాయంపై స్పందించిన 'సాక్షి'కి, నిబంధనలకు విరుద్ధంగా జేసీబీ సీజ్ చేయడంపై పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడిన మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

కార్మిక శాఖ సహాయ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



నూతన కార్మికశాఖ సహాయ కమిషనర్‌గా జి.ఎల్లాజీ రావు

విజయనగరం గంటస్తంభం: విజయనగరం కార్మికశాఖ సహాయ నూతన కమిషనర్‌గా జి.ఎల్లాజీ రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఏటీ శ్రీనివాసులు నుంచి ఉదయం 10 గంటలకు బాధ్యతలు తీసుకుని విధుల్లో చేరారు. అనంతరం కార్మిక శాఖ కార్యాల యంలో కార్మిక శాఖ ఉప కమిషనర్, సిబ్బంది ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, నాణ్యమైన సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

తులసిరామినాయుడువలసలో ఏనుగులు



దళాయివలస పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి: పదిరోజుల నుంచి మండలంలోని సుంకి, సంతోషపురం, గొట్టివలస తదితర గ్రామాల్లో సంచరిస్తున్న ఏనుగులు గడిచిన రెండు రోజుల నుంచి తులసిరామినాయుడు వలస, దళాయివలస గ్రామాల్లో సంచరిస్తున్నాయి. మంగళవారం పార్వతీపురం–గరుగుబిల్లి ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి పరిధిలో ఏనుగులు సంచరిస్తుండడంతో రాకపోకలు చేసేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంట పొలాల్లో ఉన్న పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ సోమవారం తెలిపారు. మండలానికి చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి బలవంతంగా పలుమార్లు శారీరకంగా అనుభవించాడంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కందివలస వాసు అనే వ్యక్తిపై పోక్సోతో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. ఈ నేపథ్యంలతో డీఎస్పీ శ్రీనివాసరావు గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి పలు వివరాలు సేకరించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి నిందితుడిని కోర్టులో ప్రవేశపెడతామని ఎస్సై చెప్పారు.

ఆకస్మికంగా సబ్‌జైల్ తనిఖీ



సబ్‌జైలును పరిశీలిస్తున్న న్యాయమూర్తులు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో ఉన్న సబ్‌జైలును విజయనగరం జిల్లా న్యాయమూర్తి ఎం.బబిత మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైల్లో వసతులను ఈ సందర్భంగా పరిశీలించి ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి అక్కడి పరిస్థితుల పట్ల ఆరాతీశారు. నిబంధనల ప్రకారం చక్కటి నడవడిక, నైతిక విలువల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని ఖైదీలకు సూచించారు. ఖైదీల ఆరోగ్యంపట్ల తీసుకుంటున్న చర్యలపై సబ్‌జైల్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే జైల్లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు. పలు విభాగాలను తనిఖీ చేసి ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ గురించి ఖైదీలకు వివరించారు. ఒక అడ్వకేట్, ఒక పారా లీగల్ వలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సలహాలను అందిస్తారని చెప్పారు. ఖైదీలు సత్ప్రవర్తనతో తమకు విధించిన శిక్షను పూర్తిచేసుకోవాలని సూచించారు. న్యాయవాదులు లేని ఖైదీలకు ఉచితంగా నియమించనున్నట్లు తెలిపారు. 70ఏళ్లు పైబడిన వారికి, అలాగే అనారోగ్యంతో బాధ పడేవారికి బెయిల్ మంజూర య్యేలా కృషిచేస్తామన్నారు. ఈ పరిశీలనలో పార్వతీపురం జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి ఎస్. దామోదరరావు, లోక్ అదాలత్ సభ్యుడు టి. జోగారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కు వెళ్తూ ప్రమాదానికి గురైన వ్యక్తి

రాజాం సిటీ: కూటమి ప్రభుత్వం రేషన్ విషయంలో అవలంబించిన విధానంతో రాజాంలోని ఓ వ్యక్తి మంగళవారం ప్రమాదం బారినపడి ఆస్పత్రి పాలయ్యాడు. దీనికి సంబంధించి టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన రాగోలు విశ్వనాథం రేషన్ సరుకులు విడిపించేందుకు మల్లయ్యపేటలోని డిపోకు సైకిల్‌పై వస్తున్నాడు. సిరి కల్యాణమంటపం వద్దకు వచ్చేసరికి అదే సమయంలో బొబ్బిలి నుంచి వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిపోయిన విశ్వనాథం తల, కాలికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 ద్వారా మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200

డబ్బులివ్వక పోతే ఖబడ్దార్..!

- డబ్బుల కోసం బాలికకు యువకుడి వేధింపులు
- ఫేక్ ఇన్‌స్ట్రాగామ్ ఖాతాలో అసభ్యకర పోస్టులు
- నిందితుడిపై కేసుల నమోదు, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ భవ్యారెడ్డి



పోలీస్‌స్టేషన్‌లో నిందితుడి అరెస్ట్ చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి

రామభద్రపురం: రోజురోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నా..చదువుకున్న వారు కూడా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతుడడం, సైబర్ నేరగాళ్లు కూడా రకరకాల యాప్‌ల ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.అక్రమంగా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఫేక్ ఇన్‌స్ట్రాగామ్ ఖాతా తెరిచి అసభ్యకర పోస్టులు పెట్టి డబ్బులు ఇవ్వాలంటూ ఓ ఆడపిల్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఓ నిందితుడు పోలీసులకు మంగళవారం చిక్కాడు. ఈ సంఘటనపై డీఎస్పీ భవ్యారెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. మెరకముడిదాం మండలం భైరిపురంగ్రామానికి చెందిన ఓ యువకుడు ఒడిశాలో ఐటీఐ చదువుతున్నాడు. అక్కడ ఫేక్ ఇన్‌స్ట్రాగామ్ ఓపెన్ చేసి అందులో ఆడపిల్లల ఫొటోలు పెట్టి లైక్‌లు కొట్టమని ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పెట్టేవాడు. ఈ క్రమంలో రామభద్రపురం గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక స్నేహితురాలి ఫొటో మార్ఫింగ్ చేసి, ఇన్‌స్ట్రాగామ్ యాప్‌లో పెట్టి ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టగా రామభద్రపురం గ్రామానికి చెందిన బాలిక తన స్నేహితురాలే కదా అని లైక్ కొట్టింది. దీంతో ఆ కుర్రాడు ఆ ఇన్‌స్ట్రాగామ్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ అయిన బాలిక ఫొటోలు స్క్రీన్‌షాట్ తీశాడు.ఆ ఫొటోలను వాడి మొబైల్ ఫోన్‌లోనే నగ్నంగా మార్ఫింగ్ చేసి ఉంచుకున్నాడు. ఇవేవీ అ బాలికకు తెలియదు. బాలిక స్నేహితురాలు అడిగినట్లుగానే నాకు అవసరం ఉంది ఓ రూ.500 కావాలని అడిగాడు. ఆమె తన దగ్గర లేవని సమాధానం ఇచ్చింది. దీంతో వెంటనే ఆ మోసగాడు నగ్నంగా..అసభ్యకరమైన ఉన్న ఫొటోలు ఆమెకు పంపించి నీవు అర్జెంటుగా రూ.8 వేలు ఇవ్వకుంటే ఈ ఫొటోలు సోషల్ మీడియా, ఫేస్‌బుక్‌లలో పెడతానంటూ బ్లాక్ మెయిల్‌కు పాల్పడ్డాడు.

పోలీసులను ఆశ్రయించిన బాధిత బాలిక

దీంతో ఆ బాలిక నీవు అలా చేస్తే నేను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వెంటనే తల్లిదండ్రులు అప్రమత్తమై స్థానిక పోలీసులను ఆశ్రయించారు.ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు సీఐ కె నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావులు మే 2వ తేదీన కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతికతను ఉపయోగించి సైబర్ మోసానికి పాల్పడిన నిందితుడిని అదుపులోకి తీసుకుని, విచారణ చేసి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సైబర్ నేరం, పోక్సో కింద నిందితుడిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ మొబైల్‌కు వచ్చే లింక్‌లు క్లిక్ చేయొద్దని,సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్లు మంచి కోసం ఉపయోగించాలని, ఇన్‌స్ట్రాగామ్, ఫేస్‌బుక్‌లు ఖాతాలు ఓపెన్ చేయడం ఆడపిల్లలకు అవసరం లేదన్నారు. సోషల్ మీడియాలో ఫేక్ ఫొటోలను చూసి ఆకర్షణకు లోనై మోసపోకూడదని హితవు పలికారు. వేగంగా కేసును ఛేజ్ చేసిన సీఐ నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావులను అభినందించారు.

లారీ ఢీకొని ఆర్మీ జవాను దుర్మరణం



బొబ్బిలి రూరల్: సత్యం మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సతీష్‌కుమార్



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుమార్తెలు



మృతుడు సత్యం (ఫైల్)

బొబ్బిలి రూరల్/బాడంగి: బొబ్బిలి మండలంలోని పారాది గ్రామం వద్ద మంగళవారం లారీ ఢీ కొన్న ఘటనలో ఆర్మీ జవాను తూముల సత్యం(53) దుర్మరణం చెందారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బాడంగి మండలం ముగడ గ్రామానికి చెందిన తూముల సత్యం మోటార్‌సైకిల్‌పై బొబ్బిలి నుంచి రామభద్రపురం వెళ్తుండగా పారాది బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో సత్యం అక్కడికక్కడే మృతిచెందినట్లు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న సీఐ సతీష్‌కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను స్థానికుల నుంచి ఆరాతీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శోకసంద్రంలో మృతుడి కుటుంబం, గ్రామస్తులు



బాడంగి: రోదిస్తున్న మృతుడి తల్లి, సోదరులు, బంధువులు

ఆర్మీ జవాను తూముల సత్యం (52) రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో ఒక్కసారిగా ముగడ గ్రామం మూగబోయింది. మృతుడి తండ్రి సోములు గతంలో మృతిచెందగా తల్లి అప్పమ్మ మరోముగ్గురు సోదరులున్నారు.వారిలో సత్యం మూడవవాడు. ఆయన 1994లో ఆర్మీలో చేరగా మిగిలినవారు వ్యసాయం చేసుకుంటున్నారు. ఆయనకు 2001లో నాగరత్నంతో వివాహం జరిగింది. వారికి బీటెక్ చదివిన అబ్బాయి అరవింద్, విశాఖలో ఆంధ్రా యూనివర్సిటీలో బీఎస్సీ చదువుతున్న అమ్మాయి హిమబిందు ఉన్నారు. ఆయన తొమ్మిదేళ్ల క్రితమే బొబ్బిలిలోని గొల్లవీధిలో ఇల్లు కొనుగోలు చేసి భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నారు. ఇదిలాఉండగా ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ ఏఎస్సైగా ఆయనకు ప్రమోషన్ రాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగదల్‌పూర్‌లో బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన అక్క రామభద్రపురంలో ఉంటున్నందున తాను బుధవారం వెళ్లిపోతున్నానని చెప్పేందుకు బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. రోడ్డు ప్రమాదంలో సత్యం మృతి చెందడంతో భార్యాపిల్లలు, తల్లి, సోదరులు, బంధువులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆర్మీ జవాను మృతదేహానికి బుధవారం ముగడ గ్రామంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి.

మాటల్లో తీపి..చేతల్లో చేదు

- షుగర్ ఫ్యాక్టరీల నిర్వహణపై ప్రభుత్వం స్పష్టత కరువు
- రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శికి భీశెట్టి వినతిపత్రం



రాష్ట్ర పరిశ్రమల వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శి యువరాజ్‌కు వినతిపత్రం అందజేసిన భీశెట్టి బాబ్జీ

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలో కీలకమైన తాండవ, ఏటికొప్పాక, తుమ్మపాల, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీల భవిష్యత్తుపై రాష్ట్ర ప్రభుత్వం విధానమేమిటో ప్రకటించాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శి ఎస్.యువరాజును విన్నవించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో యువరాజుతో ఆయన సమావేశమై ఉత్తరాంధ్రలోని సహకార చక్కెర కర్మాగారాల కార్మికులు, ఉద్యోగులు, రైతులు పడుతున్న ఇబ్బందులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ..గడిచిన ఐదేళ్లుగా భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు వారికి రావాల్సిన పీఎఫ్, గ్రాట్యుటీ యాజమాన్యం చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, కొంతమంది కార్మికులు ఆకలి, ఆవేదనతో ఆందోళన చెంది చనిపోగా, వారి పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. తాండవ, ఏటికొప్పాక, అనకాపల్లి, సుగర్ ఫ్యాక్టరీల పరిధిలో రైతులకు ఇంకా బకాయిలు చెల్లించాల్సి ఉందని, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీకి ఆ పరిస్థితి లేదని, రాష్ట్ర ప్రభుత్వం అసలు సుగర్ ఫ్యాక్టరీలను నడుపుతుందో, మూసేస్తుందో ప్రకటించకుండా రైతుల్ని ఆందోళనకు గురిచేస్తోందన్నారు.

వెంటనే బకాయిలు చెల్లించాలి

నాలుగు ఫ్యాక్టరీల కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.35 కోట్లు ఉండవచ్చునని ఫ్యాక్టరీల్లో ఉన్న యంత్ర పరికరాలను అమ్మేసి ప్రభుత్వం వెంటనే కార్మికులు, రైతుల,ఉద్యోగుల బకాయిలు చెల్లించవచ్చని అభిప్రాయపడ్డారు. మూతపడిన సుగర్ ఫ్యాక్టరీల స్థానంలో ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తే బాగుంటుందని భీశెట్టి అభిప్రాయపడ్డారు. కార్మికుల బకాయిలు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని యువరాజు హామీ ఇచ్చినట్లు భీశెట్టి తెలిపారు.

పైడితల్లికి పుష్పాలంకరణ



పుష్పాలంకరణలో భక్తులకు దర్శన మిస్తున్న చదురుగుడి పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్ప సేవ నిర్వహించారు. చదురుగుడి, వనంగుడిలలో కొలువైన పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారికి లడ్డూలతో నివేదన చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద మహిళలు దీపారాధన చేశారు. ఆలయ ఇన్చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మనసున్న 'మాస్టారు'

- అవయవ దానానికి ముందుకొచ్చిన విజయ్ కుమార్
- మిమ్స్ వైద్య కళాశాలకు అంగీకార పత్రం అందజేత



అంగీకార పత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్ మాస్టారు

నెల్లిమర్ల: నెల్లిమర్ల మండల రిటైర్డ్ ఎంఈఓ ఈపు విజయ్ కుమార్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. తన తదనంతరం శరీరాన్ని మిమ్స్ వైద్య కళాశాలకు దానం చేసేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల సమ్మతితో అవయవ దానం చేస్తున్నట్లు మిమ్స్ వైద్యులకు మంగళవారం అంగీకార పత్రాన్ని అందజేశారు. తద్వారా మనసున్న మాస్టారుగా నిరూపించుకున్నారు. నెల్లిమర్ల మండల విద్యాశాఖాధికారి–2గా విధులు నిర్వర్తించి, తాజాగా ఉద్యోగ విరమణ పొందిన ఈపు విజయ్ కుమార్ తన తదనంతరం పార్థివ దేహాన్ని మిమ్స్ వైద్య కళాశాలకు అందజేస్తున్నట్లు ప్రకటించారు. తన భార్య, కుమార్తె సమ్మతితో కళాశాల డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, అనాటమీ డిపార్ట్మెంట్ విభాగాధిపతి డాక్టర్ అనిల్ కుమార్‌కు మంగళవారం డిక్లరేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌ను అభినందిస్తూ మిమ్స్ వైద్యులు అభినందన పత్రం అందజేశారు. విజయ్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా నాలుగు దశాబ్దాల పాటు సేవలందించారు. సారిపల్లి ప్రాథమిక పాఠశాలలో మొట్టమొదట ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. అలాగే నటుడిగా నాటకరంగంలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ తన అవయవ దానంతో మెడికల్ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తన లాగానే నేత్ర, అవయవ దానానికి మరింత మంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



అదృశ్యమైన దుర్గాప్రసాద్

కొత్తవలస: మండలంలోని గులివిందాడ గ్రామానికి చెందిన కోట దుర్గాప్రసాద్ (22) అదృశ్యం కావడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు కొత్తవలస పోలీసులు మంగళవారం తెలిపారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుర్గాప్రసాద్ నర్సీపట్నం సమీపంలోని ఓ కోళ్లఫామ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కాగా గత నెల 27వ తేదీన సెలవుపై సొంతూరు వెళ్తున్నట్లు ఫామ్ యజమానికి తెలిపాడు. అదే రోజు కొత్తవలసలో దుర్గాప్రసాద్ తన బావమరిదికి కనిపించినప్పటికీ ఇంటికి మాత్రం చేరలేదు. యువకుడి మోటర్ సైకిల్ విశాఖపట్నం రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ చేసి ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు దుర్గాప్రసాద్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైద్యసిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం



అంగన్‌వాడీ కార్యకర్తను ప్రశ్నిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

- గర్భిణుల మృతిపట్ల సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశాలు

విజయనగరం ఫోర్ట్:

వివిధ కారణాలతో ప్రసవ సమయంలో, ప్రసవానంతరం గర్భిణులు, శిశువులు మృతి చెందడం పట్ల కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్ వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా సంఘటనలపై సమగ్రంగా దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నవంబర్ 24 నుంచి మార్చి 2025 వరకు జిల్లాలో సంభవించిన నాలుగు మాతృమరణాలు, ఐదు శిశు మరణాలపై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలు, సిబ్బంది లేకపోవడం వల్ల, వైద్యుల నిర్లక్ష్యం, ఏ స్థాయిలో తప్పిదం జరిగి ఉంటుంది తదితర కారణాలపై ఆరా తీశారు. వైద్యులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశ, ఏఎన్ఎంలను ప్రశ్నించారు. అన్ని రికార్డులను సమర్పించాలని ఆదేశించారు. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల ప్రతినిధులు సమావేశానికి రాకపోవడంపై మండిపడ్డారు. గర్భిణులు వెంపడాపు లీలావతి, బంగారి సుధ మరణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశించారు. కొరమ దుర్గ మృతి విషయంలో పీజీ స్టార్ ఆస్పత్రికి నోటీస్ ఇవ్వాలని, అలాగే మరో మృతికి సంబంధించి సమావేశానికి కేజీహెచ్ వైద్యులు రాకపోవడంతో కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు కూడా లెటర్ రాయాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మాతృ, శిశు మరణాలు సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పొంతన లేని నివేదికలు

వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది ఇస్తున్న నివేదికలు పొంతన లేకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల స్థాయిలో ఇరు శాఖల అధికారులు నెలకోసారైనా సమావేశమై చర్చించుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎస్.పి.పద్మశ్రీరాణి, ఘోషాఆస్పత్రి గైనకాలజీ హెచ్ఓడీ డాక్టర్ అరుణశుభశ్రీ, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీడీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

దక్కని ఆశించిన 'మద్దతు'

- అరకొరగా వరి క్వింటాకు రూ.69 పెంపు
- తీవ్ర ఆందోళనలో అన్నదాతలు



వరిపంట

పార్వతీపురం/విజయనగరం ఫోర్ట్: విత్తనాలు, ఎరువులు సాగు వ్యయం రోజురోజుకూ తడిసి మోపెడవుతోంది. ఎరువులు, పురుగు మందుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూలీల ఖర్చులు గణనీయంగా పెరుగుతున్నాయి. ట్రాక్టర్లతో వ్యవసాయం చేయడంతో డీజిల్ ధరలు కూడా తగ్గనంటున్నాయి. ఈ ధరాభారంతో రైతుల సాగు వ్యయం ఏటా పెరిగిపోతోంది. ఖర్చులు, ధరలు పెరిగే స్థాయిలో మద్దతు ధర పెరగకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మద్దతు ధర సాగు వ్యయానికి అనుగుణంగా ఉంటుందని ఆశించినప్పటికీ రైతులకు నిరాశనే కలిగించింది. వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్రప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించింది. గిట్టుబాటు ధర ఎలా ఉన్న మద్దతు ధర సాగు వ్యయం ఆధారంగా పెరుగుతుందని ఆశపడిన రైతులకు తీవ్ర నిరాశే మిగిలింది. మొక్కుబడిగా వరి పంటకు మద్దతు ధరను కేంద్రం పెంచిందని రైతుల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయకుండా పాలకులు మోసగిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగుకు, వ్యయానికి ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరకు ఏ మాత్రం పొంతన లేకపోవడంతో రైతులు ఏటా నష్టాలను చవిచూస్తున్నారు. ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.69 పెంచి రైతులను ప్రభుత్వం దగా చేసిందని వాపోతున్నారు. ఎంతోకాలంగా ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదు. క్వింటా ధాన్యం మద్దతు ధర రూ.2,300ల నుంచి రూ.2369కి పెంచి రైతులకు తీవ్ర నిరాశను మిగిల్చింది.

పంట పండించాలంటే నష్టపోవాల్సిందే..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రధానమైన వరిపంటకు కేంద్రం మద్దతు ధర ప్రకటించినప్పటికీ ఏటా మిల్లర్లు, దళారులు కుమ్మక్కై రైతులకు మద్దతు ధర అందివ్వని పరిస్థితి నెలకొంది. రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లర్లకు ధాన్యాన్ని తరలిస్తున్నట్లు అధికారులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ వాస్తవానికి దళారుల నుంచి రైతుల పేరు మీద మిల్లర్లకు తరలించే పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా రైతులకు మద్దతు ధర అందని ద్రాక్షగా మిగిలింది. ఉమ్మడి జిల్లాలోని పలుగ్రామాల్లో ఎకరాకు 24 నుంచి 28 బస్తాల వరకు దిగుబడి వస్తోందని పంట దిగుబడి ప్రయోగాలద్వారా నిర్ధారించి అధికారులు ప్రకటించారు. దిగుబడుల ఆధారంగా మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ.2369 ప్రకారం 80 కిలోల బస్తాకు రూ.1790లు వస్తుంది. ఈ ప్రకారం 25 బస్తాలకు రూ.40వేల వరకు ఆదాయం రాగా, ఎకరాకు పెట్టుబడిగా రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు వ్యయం అవుతోంది. ఈ లెక్కన రైతుకు మిగిలేది రూ.10వేల నుంచి రూ.15వేలు మాత్రమే. అదే రైతు కూలికి వెళ్తే ఏడాదికి రూ. ఒక లక్ష వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. సొంతభూమి సాగు చేసుకునే రైతుకు కొంతవరకు మిగులు కనిపించే అవకాశం ఉండగా కౌలు రైతుకు కౌలు, ఖర్చులు పోను మిగిలేది అంతంతమాత్రమేగానే ఉంది.

మద్దతు ధరపై పునరాలోచన చేయాలి



ప్రస్తుతం ప్రకటించిన మద్దతు ధర సాగు ఖర్చులకు వచ్చిన ఆదాయానికి పొంతన ఉండడం లేదు. రోజురోజుకూ వ్యవసాయ మదుపులు పెరిగిపోతున్నాయి. కూలీలు కూడా దొరకడం లేదు. వ్యవసాయం చేయాలంటే ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వాలు కేవలం మొక్కుబడిగా మద్దతు ధర పెంచి మమ అనిపించి రైతులను మోసం చేస్తున్నారు. ప్రభుత్వం వరి పంటకు మద్దతు ధర పెంచడంపై పునరాలోచించి రైతులకు న్యాయం చేయాలి.

–బి.అప్పలనాయుడు, రైతు, నాగూరు